
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## కన్నడ చిత్రాల్లో నా పాత్రలు

### - జయంతి

*( విజయచిత్ర , జనవరి, 1970 నుంచి పునర్ముద్రణ)*

**ఆరు సంవత్సరాల** క్రిందట జరిగిన సంఘటన. అప్పట్లో తెలుగు చిత్రాల్లో ఓ మాదిరి వేషాలు వేస్తున్నాను. ఒక్క తమిళ చిత్రంలో ఉపనాయకి పాత్ర ధరించాను. ఆ సమయంలో దర్శకులు శ్రీ వై. ఆర్. స్వామిగారు తాము తీస్తున్న "జేనుగూడు" (తేనెపట్టు) అనే కన్నడ చిత్రంలో ఒక ముఖ్య పాత్రకు బుక్ చేసుకున్నారు. "కన్నడంలో ఒక్క అక్షరం నాకు రాదే" అన్నాను.



"ఫర్వాలేదు. తెలుగులో వ్రాసుకుని కంఠతా పట్టండి. ఈ వేషానికి మీరు బాగుంటారు" అన్నారు స్వామిగారు. నా కన్నడ చిత్రసీమ ప్రవేశం ఆ విధంగా శ్రీ స్వామిగారి ఆశీస్సులతో ప్రారంభమైంది.

కాని, ఆ చిత్రం షూటింగ్ ప్రారంభమైన నెలరోజులకే, నిర్మాత శ్రీనివాసన్‌గారు, దర్శకులు శింగ్ ఠాకూర్‌గారు తాము తీస్తున్న "చందవల్లియ తోట" చిత్రంలో నాయకిగా బుక్ చేశారు యీ చిత్రంలో నాయకుడు శ్రీ రాజ్‌కుమార్.

అంటే కన్నడ చలనచిత్ర రంగంలో ఆనాడూ, నేడూ కూడా టాప్ హీరో అన్నమాట. అంత గొప్ప నాయకుని పక్క నేను నాయకిగా బుక్ అవటం, అదికూడా, యింకా ఒక కన్నడ చిత్రమైనా రిలీజ్ కాకుండా జరగటం నా అదృష్టం. నా భవిష్యత్ కన్నడ చిత్ర రంగంలో మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఉంటుందని ఆనాడే భవిష్యత్‌వాణి పలికింది.

ఈనాడు వెనుదిరిగి చూసుకుంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఆరు సంవత్సరాలలో నేను 50 కన్నడ చిత్రాలలో నటించాను. యీ మధ్యలో కొన్ని తెలుగు, తమిళ, హిందీ చిత్రాలలో కూడా నటించాను. కాని కన్నడ రంగంలో నాకు లభించిన ఆదరణ, గౌరవం, కీర్తి, మానసిక తృప్తి అంతా ఇంతాకాదు. విడుదలైన నా మొదటి కన్నడ చిత్రం, "చదవల్లియ తోట" అదొక సుకృతం. పైగా ఆ చిత్రం రాష్ట్రపతి రజిత పతకం పొందింది. అంటే మొదటి విడుదల చిత్రంతో, శ్రీ రాజ్‌కుమార్ ప్రక్క నాయకిగా ప్రెసిడెంట్ అవార్డు పొందిన హీరోయిన్ అయ్యాను. ఇంతకన్నా ఏ నటీమణైనా ఏమి కోరుకుంటుది? ప్రజలు, పత్రికలు చిత్రంతోబాటు, నా నటనను కూడా ప్రశంసించారు. ఆ తర్వాత "జేనుగూడు" చిత్రం విడుదలై, విజయవంతంగా ప్రదర్శింపబడింది. నాకింకా మంచిపేరు వచ్చింది.

శ్రీ భగవాన్ శ్రద్ధవల్ల, నా కృషివల్ల కన్నడం చదవటం, మాట్లాడటం బాగా నేర్చుకున్నాను. మేష్టారిని పెట్టుకుని కృషి చేశాను. అందువల్లే, ప్రారంభం నుంచీ నాకు డబ్బింగ్ కంఠం అవసరం లేకపోయింది. ఈ రోజున కన్నడ భాష నాకు మంచినీళ్ళ ప్రాయం.

మొదటి చిత్రం నుంచీ నాకు అభిమానుల ఉత్తరాలు ప్రారంభమయ్యాయి. సగటున రోజుకు 3 ఉత్తరాలు వచ్చేవి మొదట్లో. క్రమేపీ ఆ సంఖ్య రోజుకి 40 ఉత్తరాల దాకా పెరిగింది.

ఇప్పటికీ ఏవరేజ్‌న నెలకు 1000 ఉత్తరాలు వస్తాయి. ఇంక ప్రజల ప్రేమాదరణలు చెప్పలేను. నా అదృష్టం ఏమో మరి, కన్నడ పత్రికలు అన్నీ కూడా మొదటి నుంచీ నన్ను అభిమానిస్తూ ప్రోత్సహిస్తూనే వచ్చాయి. నా చిత్రాల్లోని రకరకాల పాత్రలను గురించి వ్రాస్తూ నా నటనను ప్రశంసిస్తూ, ఎక్కడైనా లోట్లు వుంటే సద్విమర్శనలతో నన్ను తీర్చిదిద్దుతూ, నా భవిష్యత్ బాటను రంగవల్లిగా మార్చి, నా పేరు ప్రతిష్టలను ఉన్నత స్థాయిలో నిలబెట్టిన కన్నడ పత్రికాధిపతులకు, రచయితలకూ నేను ఎప్పుడూ కృతజ్ఞతా పూర్వక వందనాలర్పిస్తూనే వుంటాను.

ఇంక నిర్మాతల విషయంలో నేను ఆనంద బాష్పాలతో కృతజ్ఞతతో తెలుపుకోవలసిందెంతైనా వుంది. తెలుగుపిల్ల అనే భావం లేకుండా, విశాల హృదయంతో ఆప్యాయతతో, వేషాలివ్వడం అటుంచి నిత్య జీవితంలో నన్ను ఎంతో ఆదరణతో చూస్తారు నిర్మాతలు. ముఖ్యంగా నేను సగర్వంగా, ఆనందంతో చెప్పుకోవలసిందేమంటే, నా కన్నడ నిర్మాతలందరూ స్వంత కూతురులాగా, తోడబుట్టిన సోదరిలాగా, భావిస్తూ వారి ఇళ్ళకు తీసుకుపోయి కుటుంబంలోని వక్తులందరితోటి అరమరికలు లేకుండా, "అమ్మా, వదినా" యిత్యాది వరసలతో పిల్చుకునే ప్రేమాభిమానాలు కలిగించారు. ఒక్కొక్కప్పుడు నా నిర్మాతలు తీస్తూవున్న ఏదైనా ఇత్రంలో నాకు నటించే అవకాశంలేకపోయినా, ఆ తాత్కాలికమైన వ్యాపార పద్ధతులు నిర్మాణ కాలంలోని ఎడబాటులు, మా మధ్య వుండే గౌరవాభిమానాలకు ఏ మాత్రం లోటుపాట్లు కలిగించేవి కావు. వారు, కుటుంబాలతో మెడ్రాస్ వచ్చినా, నేనువేరే చిత్రం కోసం మైసూర్ వెళ్ళినా, ఒకళ్ళ ఆతిధ్య ఆదరానురాగాలు మరొకళ్ళం పొందుతూ వుండటం నా సుకృతంగా భావిస్తాను.

కన్నడంలో సుప్రసిద్ధ దర్శకులైన వారందరి వద్దా నేను నటించాను. వారి వారి దర్శక ప్రతిభలతో, విభిన్న తరహా పాత్రలను నిర్వహించి, చిత్ర జీవితంలో అనేక విషయాలు నేర్చుకునే భాగ్యం పొందాను. ముఖ్యంగా నేను ఎక్కువ చిత్రాల్లో పని చేసింది శ్రీ విఠల్, శ్రీ స్వామి, శ్రీ సింగ్‌ఠాకూర్, శ్రీ రంగా, శ్రీరామ్మూర్తి, శ్రీ పేకేటిగార్ల దర్శకత్వంలో. వీరు నిర్మించిన చిత్రాల్లో నా పాత్రలు కూడా అతి క్లిష్టమైనవి. రకరకాల మనస్తత్వాలతో కూడినవి. అటువంటిచక్కని, చిక్కని పాత్రలు నాకు లభించటం అదృష్టం. ఎంతో అనుభవం వున్న ఉత్తమ దర్శకుల వద్ద పని చేయటం వల్ల "ఆర్టిస్టు" కళా ప్రతిభ ఎంతో రూపుదిద్దుకుని బాగా పండుతుందని నా విశ్వాసం.

నా చిత్రాలు ప్రెసిడెంట్ అవార్డులు పొందినా, నన్ను ప్రజలు, పత్రికలూ ప్రశంసించినా నాకు సన్మానాలు సత్కార్యాలు, బిరుదులు లభించినా కన్నడ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ నన్ను ప్రశంసించి ఆప్యాయతతో చూసినా, నేనాడూ యీ ఆరు సంవత్సరాలలో పొంగి బోర్లపడలేదు. గర్వంతో చిందులు త్రొక్కలేదు. నా నిర్మాతలకు, దర్శకులకు, తోటి నటీనటులకు ముఖ్యంగా ప్రజానీకానికి పాత్రికేయులకు కృతజ్ఞతాపూర్వక వందనాలర్పిస్తూ, నా అదృష్టాన్ని అభినందించుకుంటూ కళాకారిణిగా ఆత్మ తృప్తిని చెందుతూ వున్నాను. ఏ పూర్వ జన్మ పుణ్యమో, ఏ పురాతన సుకృతమో, నన్నాశీర్వదించి కన్నడ కళామ తల్లి కమ్మని ఆలింగనంలో కించిత్ సేవ చేసుకునే అదృష్టాన్ని ప్రసాదించిందని భావించుకుంటూ వుంటాను. తెలుగు గడ్డమీద నాకు పేరు ప్రతిష్టలు, చక్కని పాత్రలు, చిత్రాలు రాలేదనే చింతా భావనా ఆవేదనా నన్ను క్రుంగదీయకుండా కన్నడ చలనచిత్ర రంగం నన్ను కటాక్షించి నాలోని కళాతృష్ణ తీరేలాగా నేను కళాకారిణిగా జీవించేలాగా చేసింది. అదే నా అదృష్టం. "కళా కోకిల", "అభినయ శారద" ఇత్యాది బిరుదులు ప్రసాదించిన కన్నడ ప్రజలకు నేనెంతో ఋణపడి వున్నాను.

నేను ధరించిన పాత్రలలో ముఖ్యంగా పేర్కొనదగ్గవీ, ప్రశంసల నందినవీ నటిగా నాకు ఆత్మతృప్తి నిచ్చినవీ యీ సందర్భంలో నేను చెప్పటంలో అతిశయోక్తి ఏమీ వుండదని భావిస్తున్నాను.

తమిళ చిత్రం 'సిత్తి' ( పిన్ని) లో శ్రీమతి పద్మిని ధరించిన పాత్రకు నన్ను కన్నడంలో ఎన్నుకున్నప్పుడు నేనెంతో భయపడ్డాను. కాని దర్శకులు శ్రీ సంపత్, నిర్మాత శ్రీ ఎస్. వి. ఎస్. జగన్నాధరావుగారు (మన యస్. వి యస్. సంస్థ నిర్మాత) నాలో విపరీతమైన ఆత్మ విశ్వాసాన్ని కలిగించారు. ఆ పాత్రకు నేను సంపూర్ణ న్యాయం చేకూర్చానని పెద్దలు నన్నాశీర్వదించినప్పుడు ఎంతో ఆనందం కలిగింది. అట్లాగే "చక్రతీర్థ" లోని నా పాత్రను శ్రీ నాగిరెడ్డిగారు, శ్రీ బి.యస్ రెడ్డిగారు, కీ.శే. శ్రీవాసన్‌గారూ ఎంతో ప్రశంసించి నా కృషి చరితార్ధమైందని అంటే నాకు ఆనందభాష్పాలు వచ్చాయి. ముఖ్యంగా కష్టాలతో కరుడుగట్టిన మాతృమూర్తిగా నా నటనను శ్రీమతి సావిత్రిగారు ప్రశంసించి ఆలింగనం చేసుకున్నప్పుడు ఎంతో పొంగిపోయాను. ఇదే విధంగా "రాత్ ఔర్ దిన్" చిత్రంలో తను నటించిన పాత్రను నేను కన్నడ

"ఎరడుముఖ"లో చేసినప్పుడు ఆ చిత్రాన్ని చూసి శ్రీమతి నర్గీస్ ఎంతగానో అభినందించింది. కళాకారిణికి ఇంతకన్నా గర్వకారణమేముంది?

'మంత్రాలయ మహాత్మె' అనే శ్రీ రాఘవేంద్ర విజయం చిత్రంలో శ్రీ స్వామి పాత్రకు రాజ్‌కుమార్‌గారిని ఎన్నుకున్న తర్వాత వారి సతీమణి సరస్వతి పాత్రకు ఎవరిని వేయటం అని నిర్మాతలు ఆలోచనలో పడ్డారు. అప్పుడు రాఘవేంద్ర మఠం గురుపాదులు శ్రీస్వామిగారు ఆ పాత్రకు 'జయంతి' అని సెలవిచ్చారు. ఈ సంగతి తెలుసుకున్న నేను ఆ చిత్రం తర్వాత మంత్రాలయం వెళ్ళి దర్శనం చేసుకుని జన్మచరితార్థం చేసుకున్నాను.

నేను నటించేటప్పుడు ఆ పాత్రలో లీనమై అర్థం చేసుకుని పాత్రకు న్యాయం చేకూర్చే అవధులకు వెళ్ళడానికి సహకరించి, ప్రోత్సాహమిచ్చిన నా దర్శకులకు ఎప్పుడూ చేతులు జోడించి నమస్కరిస్తాను.

50 చిత్రాల్లో నటించినా, యింకా తృప్తి, ఒక అవధి నాకు గోచరించలేదు. హిందీ "ఖాందాన్"లో నూతన్ పాత్రను కన్నడ "మురియద మనె"లో నటించాను. "రాత్ ఔర్ దిన్"లో నర్గీస్ పాత్రను "ఎరడు ముఖ"లో ధరించాను. "మా ఇంటి మహాలక్ష్మి", "ముద్దుబిడ్డ"ల్లో జమునగారి వేషాల్ని "గృహలక్ష్మి","మమతయె బంధన"లో వేసాను. అలాగే "ఔరత్"లో పద్మిని వేషం "చిక్కమ్మ"లో వేసే అదృష్టం కలిగింది. ఇవన్నీ ప్రజాదరణ, పత్రికా ప్రశంసలు పొందిన చిత్రాలే. వివిధ తరహా పాత్రలు, విభిన్న మనస్తత్వాలు గల పాత్రలు నాకు లభించాయి. "చందవల్లియతోట"లోని సామాన్య కుటుంబ స్త్రీ పాత్రకు "మిస్. లీలావతి"లోని అల్ట్రా మోడరన్ గర్ల్‌కు ఏమీ పోలికలే లేవు. ఉత్తర, దక్షిణ ధృవాల్లాంటి విరుద్ధ మనస్తత్వాలు గల పాత్రలు రెండూ ట్రాజడీలే – రెండూ ప్రెసిడెంట్ అవార్డు పొందిన చిత్రలే. అలాంటివి లభించటం ఆర్టిస్టుకు ఎంత ఆనందమో చెప్పలేను. ఈ విధంగానే "రాఘవేంద్ర విజయ"లో మహాపతివ్రత వేషానికి పోలికలే లేవు. ముఖ్యంగా "చక్రతీర్థ"లో నేను ధరించిన ద్విపాత్ర అంటే తల్లీ, కూతురు ప్రజల, పత్రికల ప్రశంసలను పొంది అనేక అవార్డులు, బిరుదులు లభించేలాగా చేసింది. "ప్రతిజ్ఞ", "ముద్దుమీనా", "నక్కరె అదె స్వర్గ", "గృహలక్ష్మి", "చిక్కమ్మ", "చూరిచిక్కణ్ణ", "భలేరాజ", "భలేబసవ" మొదలైన చిత్రాల్లోని నా పాత్రలు ఎంతో గర్వంగా చెప్పుకోదగ్గవి. ప్రజలు, పత్రికలు నన్ను 'గ్లేమర్ గర్ల్' అనీ, 'ట్రాజడీ క్వీన్' అనీ కూడా ప్రశంసించే అదృష్టం కలిగించిన పాత్రలివన్నీను. ఏ పాత్ర ధరించినా నా గమ్యం ఒకటే ఆ పాత్రని అర్థం చేసుకోవటం, దర్శకులు తీర్చిదిద్దినట్లుగా నటించటం. అదే నా ధర్మం. నా బాధ్యత.

ఇక నా హీరోలను గురించి చెప్పాలి నేను. 50 చిత్రాల్లో నటిస్తే, అందులో సగం చిత్రాలలో శ్రీ రాజ్‌కుమార్ నాయకుడు. అదొక సుకృతం. అందువల్లే నేనింత పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోగలిగాను అని నా భావన. యావత్తు కన్నడదేశం, మమ్మల్నిద్దర్నీ "రాజాజోడీ" అంటారు. నా మొదటి విడుదల చిత్రం 'రాజ్'తో, నా యాభైయవ చిత్రం తిరిగి 'రాజ్'తోటే. మొదట "చందవల్లియతోట" – కళాఖండం. 50 వ చిత్రం "కృష్ణదేవరాయ" వర్ణచిత్రం కూడా మహోజ్వల కళాఖండం అయి తీరుతుంది. సౌజన్యమూర్తి, ఉత్తమ కళాకారుడు, అఖిల కర్ణాట ప్రజానీకానికి ప్రేమైకపాత్రుడు అయిన

నట సార్వభౌముని ప్రక్క సుమారు పాతిక చిత్రాల్లో నటించిన "నాయిక"గా ఆయనలో వందో వంతైనా నటనను నేను ప్రదర్శింపగలిగితే ధన్యురాలిననే ఎప్పుడూ భావిస్తాను నేను. అదేవిధంగా కళ్యాణ్, ఉదయకుమార్ల ప్రక్కకూడా నాకెంతో మంచిపేరు వచ్చింది. మొదటినుంచీ నాకు ఉత్తమ కళాకారులైన శ్రీ రాజ్‌కుమార్, శ్రీ ఉదయకుమార్, శ్రీ కల్యాణ్‌కుమార్, శ్రీ అశ్వథ్, శ్రీ నాగేంద్రరావు, శ్రీమతి పండరిబాయి, శ్రీ బాలకృష్ణ, శ్రీ నరసింహరాజు, శ్రీమతి జయశ్రీ మున్నగువారి ప్రక్క నటించే అవకాశం కలగటమే గొప్ప సుకృతం. ఈ మహామహుల ప్రక్క నటించే సందర్భంలో నాకు లభించిన ఆదరణ, ప్రోత్సాహం, అభిమానమే నన్నింత వరకూ తీసుకొచ్చాయి.

కళాకారిణికి జీవితాశయం ఒక్క చిత్రాల్లో నటించటమేకాదు. ప్రజాసేవ, దేశసేవ కూడా జీవిత ప్రమావధిగా భావించాలనే వ్యక్తుల్లో నేనొక్కర్తెను. సంఘానికి, సంస్థలకు, దేశానికి, ఏ విధమైన సేవ, కళ ద్వారా ప్రదర్శనలద్వారా జరగాలన్నా ముందంజ వేస్తూ ఇతరులతోబాటు చేసినినంతవరకూ కృషి చేసే అవకాశం కూడా నాకు దొరికింది. అందువల్లనే ప్రభుత్వ స్థాయిలో కూడా అనేకమంది పెద్దలకు రాజకీయ వేత్తలకు, సాంఘిక సేవా సంస్థలకు ఎంతో సన్నిహితంగా మెలిగే వాతావరణం నాకు లభించింది. తక్కువ కాలంలో ఆరు సంవత్సరాలలో కొంత సాధించి నా జీవితాన్ని ధన్యం చేసుకునే విధంగా నన్ను "నటి"గా తీర్చిదిద్దిన కన్నడ కళామతల్లికి నా నమోవాక్కులర్పిస్తున్నాను. భవిష్యత్‌లో వెలుగుబాటలో నడిచి, ఇతోధికంగా సేవ చేసే బలం ప్రసాదించమని అర్థిస్తున్నాను.

Post your comments